సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



వామ్మో పులులు 10లో▸

జిల్లాలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంత గ్రామాలకు మళ్లీ పులి భయం పట్టుకుంది. ఉదయం, సాయంత్రం వేళలో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు.

గోండుపాలనలో ఇనుపధాతువు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను సిర్పూర్ కేంద్రంగా నాడు గోండురాజులు సుమారు 881 ఏళ్ల పాటు పాలించారు. వీరి హయాంలోనే ఇనుపధాతువును గుర్తించినట్లు చరిత్ర చెబుతోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆదర్శ పాఠశాల తనిఖీ



స్టడీఅవర్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను డీఈవో ప్రణీత శనివారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పిల్లి కిషన్, ప్రిన్సిపాల్ ఉమేష్‌రావు తదితరులు ఉన్నారు.

మహిళలు రాణించాలి



సమావేశంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ

కైలాస్‌నగర్: చిరు వ్యాపారాలు నిర్వహించడంతో పాటు సమాజంలో గుర్తింపు సాధించేలా మహిళలు రాణించాలని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ఆదిలాబాద్ పట్టణ మహిళా సమాఖ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాలు చేస్తున్న పొదుపు, వ్యాపారాలు, వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. పొదుపు పాటించడంతో పాటు బ్యాంకు రుణ కిస్తీలను సకాలంలో చెల్లించాలన్నారు. సమావేశంలో పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు ఉమాతాయి, సీఈవోలు గంగన్న, పండరి, పన్నాలాల్, సునీత పాల్గొన్నారు.

రేపు సీపీఎం జిల్లా ప్లీనరీ

ఆదిలాబాద్‌అర్బన్: సీపీఎం జిల్లా స్థాయి ప్లీనరీ సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పీఆర్టీయూ భవనంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కాంగ్రెస్ ప్లీనరీకి సీఆర్ఆర్, గండ్రత్

ఆదిలాబాద్‌అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్న కాంగ్రెస్ ప్లీనరీ సమావేశానికి శనివారం మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, రాష్ట్ర కమిటీ సభ్యుడు నరేష్ జాదవ్ హాజరయ్యారు. ఆదిలాబాద్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి సైతం పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగ సంఘం జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్


ఆదిలాబాద్‌రూరల్: బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్‌గా జక్కుల శ్రీనివాస్, కోకన్వీనర్‌గా నర్ర నవీన్ యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.

డీటీసీ శ్రీనివాస్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డీటీసీ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శనివారం నిర్వహించిన ఓస్వాయ్ ఏడో వార్షికోత్సవంలో ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా ప్రచారం చేయడం, జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో ప్రసంగించడం, పరిశోధనలు చేయడం, రోడ్డు భద్రత ప్రమాణాలు మెరుగుపర్చినందుకు గాను అవార్డు దక్కినట్లు పేర్కొన్నారు. ఈయనకు అవార్డు రావడంపై రవాణా శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.



భోరజ్ చెక్‌పోస్టు తనిఖీ పాయింట్

సీఎం దృష్టికి భోరజ్

- డ్యూటీల విషయంలో మొదలైన లొల్లి
- అక్రమ ఆదాయం కోసమే ఎంవీఐల ఆరాటం
- రచ్చకెక్కిన 'సీనియర్' పెత్తనం!
- ముదురుతున్న భోరజ్ చెక్‌పోస్టు వివాదం

సాక్షి,ఆదిలాబాద్: భోరజ్ సమీకృత చెక్‌పోస్టు.. ఇక్కడ ఎంవీఐ, ఏఎంవీఐలకు డ్యూటీ కేటాయించేందుకు ఓ సీనియర్ అధికారి పర్యవేక్షణ చేస్తారు. ఆ కేటాయింపులకు అనుగుణంగా విధులు కొనసాగాలి. అయితే ఇక్కడ తనకు అదనపు డ్యూటీలు కల్పించాలని లేని పక్షంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు లక్షల రూపాయలు తనకు ఇవ్వాలని సీనియర్ ఎంవీఐ వివాదం సృష్టించడం, మొత్తంగా వ్యవస్థను తన గుప్పిట్లోకి తెచ్చుకోవాలనే యత్నాలు కాస్త రచ్చకెక్కాయి. ఈ లొల్లి ఎన్ని రోజుల పాటు కొనసాగుతుందో కానీ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖలో ఈ చెక్‌పోస్టు వ్యవహారంపైనే చర్చ సాగుతుండటం గమనార్హం. మరోవైపు ఈ అంశం సీఎం దృష్టికి కూడా చేరినట్లు సమాచారం.

మూడు షిఫ్టులలో డ్యూటీలు..

భోరజ్ చెక్‌పోస్టులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 వరకు రెండో షిఫ్ట్, రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు మూడో షిఫ్ట్ కొనసాగుతుంది. ఆయా షిఫ్టుల వారీగా కేటాయించిన ఎంవీఐలు, ఏఎంవీఐలు డ్యూటీలు నిర్వహించాలి. ప్రస్తుతం 20 మంది మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఇక్కడ పని చేస్తుండగా, డ్యూటీల విషయంలో ఏడాది కాలంగా సీనియర్ ఎంవీఐ మిగతా వారితో వివాదాలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఇక్కడ రెగ్యులర్ పోస్టులు ఏడు మాత్రమే ఉండగా, మిగతా వారు ఆన్‌డ్యూటీ, పూర్తి అదనపు చార్జీలతో పని చేస్తున్నారు. వీరి సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో డ్యూటీలు తగ్గడం, తద్వారా అక్రమ ఆదాయం తగ్గడమే వివాదానికి కారణమైంది. అయితే సదరు సీనియర్ ఎంవీఐకి ఇతర రంగాల్లో మంచి పలుకుబడి ఉండటంతో చెక్‌పోస్టుపై తన ప్రభావం చూపెట్టడం ద్వారా ఏడాదిగా వ్యవహారాన్ని కొనసాగిస్తూ వచ్చాడు. అయితే కొద్ది రోజులుగా మాత్రం ఈ వ్యవహారం ముదరడంతో ఫిర్యాదుల వరకు వెళ్లింది.

సీఎం దృష్టికి..

సీనియర్ ఎంవీఐపై మిగతా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఇప్పటికే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్నతో పాటు రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. తాజాగా సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో చెక్‌పోస్టు వ్యవహారంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ స్థలాలకు హద్దులుండాలి



అక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం

కైలాస్‌నగర్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఆయా శాఖల అధికారులు హద్దులతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. పట్టణంలోని ఖానాపూర్ చెరువు, తిర్పెల్లి ప్రాంతంలోని ఆర్అండ్‌బీ ఆధీనంలో గల పాత జాతీయ రహదారి, కేఆర్కే కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పట్టణ పరిధిలో గల ఖానాపూర్ చెరువులోని గుర్రపు డెక్క తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ చెరువును ట్యాంక్ బ్యాండ్‌గా మార్చాలని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కోర్టు ఆదేశాలతో నిలిచిపోయిన తిర్పెల్లి ప్రాంతంలోని ఆర్అండ్‌బీ రోడ్డు ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఆక్రమణకు గురవుతున్న చాంద సమీపంలోని పాత జాతీయ రహదారి నం. 7కు సంబంధించిన స్థలాలను సంరక్షించేలా ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కేఆర్‌కే కాలనీలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక, గ్రామసభల అనంతరం ఇళ్లలోని పెండింగ్ పనులు పూర్తిచేయించాలన్నారు. తద్వారా అర్హులైన వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య, డీఈఈ సురేశ్, తహసీల్దార్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఈవో

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: 'కాపీయింగ్‌ను అడ్డుకుంటే.. ఎదురుదాడే..!' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఈవో ప్రణీతతో పాటు పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాయాలని, కాపీయింగ్‌పై ఆధారపడొద్దని పేర్కొన్నారు. ముందుగా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. అలాగే పరీక్ష కేంద్రాన్ని టూటౌన్ సీఐ పురుషోత్తంచారి సందర్శించారు. ఎస్సై విష్ణుప్రకాశ్‌తో పాటు పలువురు కానిస్టేబుళ్లను పరీక్ష ముగిసేంత వరకు అక్కడే ఉండి బందోబస్తు నిర్వహించారు. కాగా, శనివారం నిర్వహించిన పరీక్షకు జిల్లాలో 236 మందికిగాను 223 మంది హాజరయ్యారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలి

- విశ్వశాంతి దూత్ దేవకీనందన్ ఠాకూర్ మహరాజ్

ఇంద్రవెల్లి: సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని బృందవనానికి చెందిన విశ్వశాంతి దూత్ దేవకీనందన్ ఠాకూర్ అన్నారు. మండలకేంద్రం నుంచి అందునాయక్‌తండా వరకు శనివారం నిర్వహించిన సనాతన్ హిందూ ధర్మ భవ్య శోభాయాత్రలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలోని హిందూ ఆలయాలకు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలన్నారు. ముందుగా ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె నివాసం వద్ద హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికారు. శోభాయాత్రలో యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జ్వాలాముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మహరాజ్ రాంసింగ్‌బాబా, నాయకులు పాయల్ శంకర్, సుహాసినీరెడ్డి, కంది శ్రీనివాస్, మారుతి డోంగ్రె పటేల్, పకీర్‌నాయక్, దీపక్‌సింగ్‌షెకావత్, గణేశ్ ముండే, కేశవ్ ముస్లే, బాబు ముండే, గోపాల్‌సింగ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న దేవకీనందన్ మహరాజ్, పక్కన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

వైద్యఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్, కోశాధికారిగా సందీప్, ఉపాధ్యక్షులుగా రాహుల్, హరీశ్, సంయుక్త కార్యదర్శిగా వంశీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వినోద్, శ్యామ్, నవీన్, సుచల, హిమబిందు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా విజయ్, అనురాధ, కన్వీనర్లుగా శ్రీకాంత్, సాగర్, స్వామి, జిల్లా కార్యదర్శులుగా ప్రదీప్‌నాయక్, వెంకటేశ్, భీంరావు, శ్రావ్యవాణి, శిల్ప, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నిఖిల్, సద్దాం, సంజీవ్, కిరణ్, సాయిప్రియ, వాణీదేవి, కార్యవర్గ సభ్యులుగా సైనత, ఆర్లైక్య, ఇఫత్, రాంబాబు, మిథిలేష్, గణేశ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కత్తి జనార్దన్, పూర్ణ చందర్, కిరణ్‌కుమార్, క్రాంతి వ్యవహరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఐవో వైసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

కుక్కల బెడద లేకుండా చూస్తాం

- ప్రతీ వార్డులో జవాన్ల వివరాలు ప్రదర్శన
- తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు
- సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ శైలజ

సాక్షి ఫోన్ ఇన్



ఫోన్‌ఇన్‌లో సమస్యలు తెలుసుకొని నమోదు చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శైలజ

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద లేకుండా చూస్తాం.. అలాగే పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతామని కమిషనర్ శైలజ అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'ఫోన్‌ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సాంతంగా ఆలకించిన ఆమె సమస్యలు తెలుసుకొని నమోదు చేసుకున్నారు. పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడుతామన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా ప్రతీ వార్డుకు ఓ జవాన్‌ను నియమించామన్నారు. ఆయావార్డుల్లో జవాన్ పేరు, సెల్‌నంబర్ తెలియజేసేలా గోడలపై పెయింటింగ్ చేయిస్తామన్నారు. ప్రజలు పారిశుద్ధ్య పరంగా ఎలాంటి ఇబ్బంది తలెత్తినా సంబంధిత జవాన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బంగారుగూడలో నిర్మించిన యానిమల్ కేర్ సెంటర్‌కు కుక్కలను తరలించేలా నెల్లూరుకు చెందిన వ్యక్తులకు ఇప్పటికే బాధ్యతలు అప్పగించామని చెప్పారు. వారం రోజుల్లో ఈ సమస్య పూర్తిగా పరిష్కరిస్తామని ప్రజలకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఫోన్ ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలిలా ఉన్నాయి.

ప్రశ్న: భుక్తాపూర్‌లో గల ఫర్నిచర్, అల్యూమినియం దుకాణాల నుంచి వచ్చే శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఆ దుకాణాలను తొలగించాలి. – పద్మ, అభిషేక్, భుక్తాపూర్.

కమిషనర్: సిబ్బందిని పంపించి విచారణ జరిపిస్తాం. అవసరమైతే వాటికి తాళం వేయించడంతో పాటు అక్కడి నుంచి తొలగిస్తాం.

ప్రశ్న: సావరి బంగ్లా వద్ద రోడ్డుపై నిర్మించిన ఇంటి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపైనే వేసిన రేకుల షెడ్డు తొలగించాలని ఎన్నిసార్లు కోరినా యజమాని పట్టించుకోవడం లేదు. ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి. –అఫ్సర్, పిట్టలవాడ.

కమిషనర్: టౌన్ ప్లానింగ్ అధికారులను పంపించి ఆ నిర్మాణాన్ని పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించి ఉంటే వెంటనే తొలగించేస్తాం.

ప్రశ్న: బట్టిసావర్‌గాం పరిధిలోని నందీశ్వర్‌నగర్‌లో కొన్నేళ్ల నుంచి ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నాం. మా కాలనీని మూడేళ్ల క్రితం మున్సిపల్‌లో విలీనం చేశారు. అయితే మా ఇళ్లకు ఇంటి పన్నులు తీసుకోవడం లేదు. పంచాయతీ అధికారులు మాకు సంబంధం లేదని చెబుతున్నారు. – లక్ష్మణ్, రిటైర్డు పోలీస్, నందీశ్వర్‌నగర్

కమిషనర్: ఈ విషయం ఇటీవల మా దృష్టికి వచ్చింది. అక్కడ ఉన్న ఇళ్లన్నింటికీ మున్సిపల్ ద్వారా నంబర్లు కేటాయించి పన్ను వసూలు చేసేలా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తాం. ఎలాంటి ఆందోళన అవసరం లేదు.

ప్రశ్న: మా కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. బయటకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. వాటిని దూరంగా తరలించాలి. – సులోచన, రణదివేనగర్, ఎండీ జావిద్, అర్బా గార్డెన్, శ్రీనివాస్, ఇందిరానగర్, రాహుల్ బృందావన్ కాలనీ, హైమద్, దస్‌గర్ మహోళ, నవీన్, అంబేడ్కర్ నగర్

కమిషనర్: కుక్కల సంతానోత్పత్తి తగ్గించేందుకు గాను వాటికి శస్త్రచికిత్స చేసేందుకు బంగారుగూడలో యానిమల్ కేర్ సెంటర్‌ను నిర్మించాం. వాటిని పట్టుకునేందుకు ఏపీలోని నెల్లూరుకు చెందిన వారికి బాధ్యతలు అప్పగించాం. వచ్చే సోమవారం నుంచి వారి సాయంతో పట్టణంలోని కుక్కలన్నింటిని ఆ కేంద్రానికి తరలిస్తాం. 15 రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం.

ప్రశ్న: మా కాలనీలో ప్రజలు నడిచేందుకు కట్టిన ఫుట్‌పాత్‌పై అక్కడి షాపు నిర్వాహకులు తమ సామగ్రిని ఉంచుతున్నారు. దీంతో ఇబ్బందవుతుంది. – కేతిరెడ్డి గంగారెడ్డి, కైలాస్‌నగర్

కమిషనర్: ఈ విషయంపై ఇది వరకే షాపు నిర్వాహకులను హెచ్చరించాం. సమస్యను పరిష్కరించేలా త్వరలోనే అల్యూమినియంతో కూడిన గ్రిల్స్‌ను ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: పట్టణంలో కొత్త మాస్టర్ ప్లాన్ ఎప్పుడు అమలు చేస్తారు. ఇబ్బందికరంగా మారిన అశోక్ రోడ్ విస్తరణ పనులు చేపడుతారా.. లేదా..? జనావాసాల్లో ఉన్న వంట గ్యాస్ గోదాంలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు. – కస్తాల అరుణ్‌కుమార్, తిర్పెల్లి

కమిషనర్: మాస్టర్ ప్లాన్ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటాం. గ్యాస్ గొడౌన్ల యజమానులకు నోటీసులు జారీ చేశాం. వారు అక్కడి నుంచి తీయకుంటే సీజ్ చేస్తాం.

ప్రశ్న: మా కాలనీలో ఫెస్టిసైడ్స్ నిల్వ చేసేందుకు భారీ గోడౌన్ నిర్మిస్తున్నారు. కాలనీ గుండా భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసం కావడంతో పాటు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిపై చర్యలు తీసుకోవాలి. – నల్ల మహేందర్, గాంధీనగర్.

కమిషనర్: ఆ ప్రాంతమంతా వాణిజ్య జోన్ కిందే ఉంది. అక్కడ ఇటీవల ఇండ్ల నిర్మాణం జరిగింది. అయితే కాలనీవాసులకు ఇబ్బందుల్లేకుండా ఉండేలా ఆ గోడౌన్ కోసం ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేయిస్తున్నాం.

ప్రశ్న: మా కాలనీలోని హనుమాన్ ఏరియా ప్రాంతంలో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పశువుల సంచారం కూడా ఎక్కువగానే ఉంది. అలాగే డ్రెయినేజీలను సకాలంలో శుభ్రం చేయడం లేదు. – అనిల్‌కుమార్, టీచర్స్‌కాలనీ

కమిషనర్: పట్టణంలో తిరిగే పశువులన్నింటినీ బంగారుగూడలోని మున్సిపల్ గోశాలకు తరలిస్తాం. రెండు, మూడు రోజుల్లో వాటి తరలింపును చేపడుతాం.

ప్రశ్న: లేన్ నంబర్ 17 వీధిలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. నల్లా కనెక్షన్లు కూడా ఇవ్వడం లేదు. వేసవి కనుక నీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. –వెంకట్‌రావు, న్యూ హౌసింగ్‌బోర్డు

కమిషనర్: మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందిని పంపించి వెంటనే నల్లాలను పెట్టించే ఏర్పాటు చేస్తాం. తాగునీటికి ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

ప్రశ్న: మా కాలనీల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు. కాలువలన్నీ కంపు కొడుతున్నాయి. కుక్కల బెడద కూడా ఎక్కుగా ఉంది. – సత్యనారాయణ, దోబీకాలనీ

కమిషనర్: పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతీ కాలనీకి ఒక జవాన్‌ను కేటాయించి డ్రెయినేజీలను శుభ్రం చేసేలా పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించాం. సంబంధిత కాలనీకి జవాన్ ఎవరనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా జవాన్ పేరు, సెల్ నంబర్‌ను ఆయా కాలనీల్లోని గోడలపై రాపిస్తాం. డ్రెయినేజీ శుభ్రం చేయకుంటే కాలనీవాసులు ఆ జవాన్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలి. కుక్కల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్రశ్న: డీఆర్డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆక్రమణలు స్టేడియం వెళ్లేవారికి ఇబ్బందికరంగా మారాయి. వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలి. – అంబకంటి అశోక్, హౌసింగ్‌బోర్డు కౌన్సిలర్

కమిషనర్: ఇది వరకు వాటిని తొలగించే ప్రయత్నం చేయగా, ఓ వ్యక్తి నానా హంగామా సృష్టించాడు. దీనిపై వన్‌టౌన్ సీఐకి లేఖ రాస్తున్నాం. పోలీసుల సాయంతో వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సాత్నాల క్వార్టర్స్ వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ స్థలాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలి. –అబ్దుల్ మాజీద్, కైలాస్‌నగర్

కమిషనర్: ఈ అంశం కోర్టులో నడుస్తుంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

ప్రశ్న: జెడ్పీ కార్యాలయం మూలమలుపు నుంచి రిక్షాకాలనీ వైపు వెళ్లే మార్గంలో అక్రమంగా వేసిన డబ్బాలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. వాటిని తొలగించాలి.– శివ, రిక్షాకాలనీ

కమిషనర్: వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

రిమ్స్‌లో ట్యూటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 16 ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. మార్చి 2న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనాటమి డిపార్ట్‌మెంట్‌లో నాలుగు, ఫిజియాలజీలో నాలుగు, బయోకెమిస్ట్రీలో రెండు, ఫార్మాకాలజీలో నాలుగు, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో రెండు పోస్టులకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 45 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని, నెలకు రూ.57,700 చెల్లించడం జరుగుతుందన్నారు. మూడేళ్ల పాటు కొనసాగిస్తామని, ఇతర వివరాలకు adilabad.telangana.gov.in వెబ్‌సైట్ సంప్రదించాలని కోరారు.

ఇసుకలారీ పట్టివేత



టింబర్ డిపోలోని పట్టుకున్న ఇసుకలారీ

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతం సమీపం నుంచి ఇసుక తరలిస్తున్న లారీని శనివారం రాత్రి అటవీ అధికారులు పట్టుకున్నారు. ఎఫ్ఆర్‌వో వినాయక్ వివరాల ప్రకారం.. ఇసుక తవ్వి తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని పక్కా సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. లారీ యజమాని ఏలేటి వరుణ్‌రెడ్డితో పాటు డ్రైవర్ ఎండీ రహీంలపై కేసు నమోదు చేశారు. లారీని ఖానాపూర్ అటవీ రేంజ్ పరిధిలోని టింబర్ డిపోకు తరలించారు.

మిస్సింగ్ కేసు నమోదు

కుభీర్: మండలంలోని జుమ్డా గ్రామానికి చెందిన ఠాకూర్ తులసిరాం (60) మూడు రోజులుగా కనిపించడం లేదు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శనయ్య తెలిపారు.

వీధికుక్కల దాడిలో లేగదూడ మృతి

భైంసా: బాసర మండల కేంద్రంలో వీధికుక్కలు దాడిలో లేగదూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన కొట్టే సాయిలుకు చెందిన పశువుల పాకలో లేగదూడపై శుక్రవారం అర్ధరాత్రి వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో లేగదూడ మృతిచెందింది. అధికారులు శనివారం చేరుకుని పరిశీలించారు.

గోండుపాలనలో ఇనుపధాతువు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అపారమైన ఇనుప ఖనిజం
- ఇనుముతో ఆయుధాల తయారీ..
- శత్రుదుర్భేద్యంగా కోటల నిర్మాణాలు
- సిర్పూర్ కేంద్రంగా కొనసాగిన పాలన
- కాకతీయులకు తీసిపోకుండా రాతి కట్టడాలు
- 881ఏళ్ల పాటు గోండుల పాలన



బాదనీకూర్తి వద్ద గోండు రాజులు నిర్మించిన కోట

ఇచ్చోడ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాచీనకాలంలో ఇనుప ధాతువులను మొదటిసారిగా గోండురాజులే గుర్తించారు. గోండురాజుల కాలంలో మేలిమి ఇనుము ఉన్న ప్రాంతాల్లో ఇనుపధాతువును వెలికితీసి ఆయుధాలను తయారు చేయించారు. తమ రాజ్యాలపై యుద్ధాలకు వచ్చిన శత్రు సైన్యాలను ఎదురొడ్డి తమ రాజ్యాలను కాపాడుకున్న చరిత్ర ఆదిలాబాద్ జిల్లా గోండురాజులకే దక్కింది. రాతితో నిర్మించిన కోటలు వారి పాలనకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఎంతో ఘనచరిత్ర ఉన్న గోండు రాజులు సిర్పూర్ కేంద్రంగా 870 నుంచి 1751 వరకు దాదాపుగా 881 ఏళ్లపాటు పాలన కొనసాగించారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన గోండురాజ్యం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిర్పూర్ కేంద్రంగా ఏర్పడడం జిల్లా ప్రాముఖ్యత తెలుస్తుంది.

ఇనుమును గుర్తించింది గోండురాజులే..



ఖానాపూర్ మండలంలోని పాతతర్లపాడులోని ఇనుప ఖనిజాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తరంగా ఉన్న ఇనుమును మొదటిసారిగా గోండు రాజులే గుర్తించారు. ఖానాపూర్ సమీపంలో ఎలగడప, పెంబి సమీపంలోని రాగిదుబ్బ, భైంసా సమీపంలోని సిరాల, లక్ష్మణచాంద మండలంలోని పారెపెల్లి, కుర్రులలో ఇనుప ధాతువును గుర్తించిన గోండురాజులు ఆ ప్రదేశాల్లో ఇనుప పరిశ్రమలను ఏర్పాటు చేయించారు. ఇనుముతో తయారైన కత్తులు యుద్ధాలలో వాడేవారని, కోటాలు, బురుజులను నిర్మించినట్లు ఆధారాలు లభించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళి వివరించారు.

సిర్పూర్ కేంద్రంగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కేంద్రంగా గోండుల పాలన కొనసాగింది. సిర్పూర్ కేంద్రంగా 19 మంది వరకు గోండు రాజులు పాలన సాగించారు. మొట్టమొదటగా సిర్పూర్ కేంద్రంగా ఏర్పడిన గోండు రాజ్యానికి భీంబాల్లల్ సింగ్ మొదటి రాజు (870–895) 25ఏళ్ల పాటు తన పాలన కొనసాగించారు. జిల్లాలో తాండురు, ఉట్నూర్‌లో గోండు రాజులు నిర్మించిన రాతి కట్టడాలు ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉన్నాయి. సిర్పూర్ అసలు పేరు సూర్యపురం కాలక్రమేనా సిర్పూర్‌గా మారింది.

ఉట్నూర్ కేంద్రంగా....

దేవగిరి కేంద్రంగా పరిపాలించిన యాదవరాజ్యానికి, ఓరుగల్లు కేంద్రంగా పరిపాలించిన కాకతీయ రాజ్యానికి ఉట్నూర్ సరిహద్దు ప్రాంతంగా ఉండేది. ఉట్నూర్ కేంద్రంగా 13వ శతాబ్దంలో గోండుల పాలన కొనసాగింది. ఆత్రం తెగకు చెందిన వంశీయులు ఉట్నూర్ కేంద్రంగా పరిపాలన కొనసాగించారు.

కనకాయి కేంద్రంగా...

మధ్యయుగంలో బీర్షా అనే గోండు రాజు బోస్రా వాగు వంపుల్లో మూడు వైపుల నీటి రక్షణగా ఉన్న ప్రదేశంలో కోటను నిర్మించి రాజ్యాన్ని స్థాపించాడు. తనకున్న కుమార్తెల పేర్లపై నాలుగు గ్రామాలను నిర్మించాడు. అవి అర్కాయి, ఖాతాయి, గిర్జాయి,కనకాయి. కొడుకులు లేక చిన్న కూమార్తె కనకాయి పేరు మీదనే కోటను నిర్మించాడు. మూడు వైపుల నీటి రక్షణగా ఉన్న కోటకు నాల్గో వైపు రక్షణ కోసం ఆరు ఎకరాల విస్తీర్ణంలో నీటి గుంటను తవ్వి బోస్రా వాగు నీటితో నింపి రక్షణ ఏర్పాటు చేశాడు. ఈ కోట విస్తీర్ణం 53.9ఎకరాలు. ప్రస్తుతం ఈ ప్రాంతం బజార్‌హత్నూర్‌లోని కనకాయి జలపాతంగా ప్రాచుర్యంలో ఉంది.

1751 తర్వాత క్షీణించిన గోండురాజ్యం...

మధ్యయుగం, ఆధునిక యుగంలో వెలుగొందిన గోండు రాజ్యం 1751 అనంతరం క్షీణించింది. 16వ శతాబ్దంలో ఏర్పడిన బహమని రాజ్యం, తరువాత గోల్కొండను పరిపాలించిన కుతుబ్‌షాహిలు, అహ్మద్‌నగర్‌ను పరిపాలించిన నిజాం షాహిలు, బీజపూర్‌ను పరిపాలించిన ఆదిల్‌షాహిలు, బీదర్‌ను పరిపాలించిన బరీద్ షాహిలు, బీరార్‌ను పరిపాలించిన ఇమాద్ షాహిలు గోండులపై నిరంతరంగా దాడులు చేశారు. 1724లో అధికారంలోకి వచ్చిన అసఫ్ జాహి (నిజాం) కాలంలో గోండులు మరింత క్షీణించారు. 1857– 58 సిపాయిల తిరుగుబాటు కాలంలో రోహిల్లలతో పాటు రాంజీగోండు నాయకత్వంలోని గోండులను మొత్తం వెయ్యి మందిని నిర్మల్‌లోని వెయ్యి ఊడలమర్రికి నిజాం ప్రభుత్వం ఉరితీయించింది. దీంతో గోండులు బయపడి పూర్తిగా అడవి ప్రాంతాలకు వెళ్లిపోయారు.

రాతి కట్టడాలే గోండుల పాలనకు సజీవ సాక్ష్యాలు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్, తాండూర్, కనకాయి ప్రాంతాల్లోని రాతికట్టడాలు గోండు రాజుల పాలనకు సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. మధ్య భారతదేశంలో ప్రసిద్ధి చెందిన రాజ్యాల్లో గోండురాజ్యం ప్రధానమైంది. గోండుల మూలపురుషుడు కోల్ బీల్లా. ఇతడి పాలనలో ఆయుధ సంపత్తి కోసం ఇనుప ఖనిజాన్ని వెలికితీయించి ఆయుధాలు తయారు చేయించాడు. ఇతడి సాయంతో ఏర్పడిన గోండు రాజ్యానికి మొదటిరాజు భీంబాల్లల్ సింగ్. మహారాష్ట్రలోని బల్లార్షాకు తన రాజధానిని మార్చాడు. భీంబల్లాల్ సింగ్ పేరుతోనే బల్లార్షా అనే పేరు వచ్చింది.

– కట్కం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్



ఉట్నూర్‌లో గోండురాజులు నిర్మించిన కోట



తాండూర్ కోట

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డిపో పరిధిలోని ప్రయాణికులు వివిధ సమస్యలను డీఎం దృష్టికి తీసుకురాగా ఆమె వాటిని నమోదు చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బేల నుండి హరీష్ రెడ్డి మాట్లడుతూ సైద్‌పూర్ నుంచి బేల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, రోడ్ సర్వే నిర్వహించి త్వరలో బస్సు ప్రారంభిస్తామని డీఎం తెలిపారు. నిర్మల్ నుంచి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఉట్నూర్ నుంచి నిర్మల్‌కి బస్సు సౌకర్యం కల్పించాలని అడుగగా ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తర్నం నుంచి అశ్విని మాట్లాడుతూ బేల సర్వీసులను వయా తర్నం నుంచి ఎప్పుడు నడిపిస్తారని అడగగా తర్నం బ్రిడ్జ్ రిపేర్ ఉందని, బేల సర్వీసులను వాయా లాండసాంగ్వి నుంచి నడుపుతున్నామని, బ్రిడ్జి రిపేర్ అయిన తర్వాత వయా తర్నం నుంచి బస్సులు పునరుద్ధరిస్తామని సమాధానం ఇచ్చారు.


ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



జాదవ్ సంజీవ్(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన జాదవ్ సంజీవ్ (45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జాదవ్ సంజీవ్ హైదరాబాద్‌లో ప్రింటింగ్‌ప్రెస్ నిర్వహిస్తుండగా కరోనా కారణంగా ఆర్థికంగా కోలుకోలేదు. కొన్నిరోజులుగా వాటోలిలోనే ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య జాదవ్ సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



బోర్లకుంట రమేశ్(ఫైల్)

కడెం: అప్పుల బాధతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కొండుకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత కొండుకూర్‌కు చెందిన బోర్లకుంట రమేశ్(45) ఈ నెల 24న రాత్రి గ్రామ సమీపంలో పంట పొలాల వద్ద పురుగుల మందుతాగాడు. శనివారం ఉదయం గమనించిన అతడి మామ పెద్ద రాజన్న పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. టుటౌన్ ఎస్సై ఊశన్న వివరాల ప్రకారం... పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన చౌహాన్ సంజన్ (53) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలం కౌటసాంగ్వి వైపు ట్రాక్టర్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టణంలోని గణేశ్ మందిర్ సమీపంలోని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



బెల్లంపల్లి పరీక్ష కేంద్రంలో హాల్ టిక్కెట్ నంబర్లు సరిచూస్తున్న సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల సైనిక్‌స్కూల్‌లో ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ సీఓఈ బాలికల కళాశాల, బెల్లంపల్లి బాలుర సీఓఈ కళాశాల, నిర్మల్(జామ్) బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగనుంది. నిర్దేశించిన పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో– ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. ఆరో తరగతిలో ఉమ్మడి జిల్లాలో 618మంది, ఇంటర్మీడియెట్‌లో 590మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి పోటీపడుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన విద్యార్థుల కోసం ఆదిలాబాద్ సంక్షేమ గురుకుల బాలికల సీఓఈ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, నిర్మల్ జిల్లా విద్యార్థులకు జామ్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో, మంచిర్యాల జిల్లా విద్యార్థుల కోసం బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని నిర్వహించనున్నారు.

ఆరో తరగతి.. ఇంటర్‌లో ప్రవేశం

గురుకుల సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం ఉంటుంది. ఆరో తరగతిలో 80, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 80 సీట్ల చొప్పున సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్ కల్పిస్తారు. ఇందుకు విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రవేశ పరీక్షలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల సైనిక్ స్కూల్ కరీంనగర్ (రుక్మాపూర్)లో మాత్రమే ఉంది. ఇందులో బాలురకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఒకేఒక గురుకుల సైనిక్ స్కూల్ మాత్రమే ఉండడంతో ప్రవేశానికి విద్యార్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండనుంది. బెల్లంపల్లి, ఆదిలాబాద్, జామ్ పరీక్ష కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా వినాల సైదులు, సంగనబట్ల శ్రీనివాస్, కె.రమాకళ్యాణి వ్యవహరించనున్నారు. పరీక్ష కేంద్రాల విషయంలో ఏమైన సందేహాలు ఉంటే విద్యార్థికి సంబంధించిన హాల్ టిక్కెట్‌లో ఇచ్చిన పరీక్ష కేంద్రం మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోఆర్డినేటర్ స్వరూపారాణి తెలిపారు.

ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థుల వివరాలు

పరీక్ష కేంద్రం	ఆరో తరగతి	ఇంటర్మీడియెట్
ఆదిలాబాద్ సీఓఈ బాలికల కళాశాల	200	199
బెల్లంపల్లి సీఓఈ బాలుర కళాశాల	201	247
నిర్మల్ (జామ్) బాలికల పాఠశాల/కళాశాల	217	144

గుర్తు తెలియని వృద్ధురాలి శవం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో రైల్వేస్టేషన్ ఎదుట మృతిచెంది ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

భైంసాటౌన్: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన విశాల్, గంగాధర్, మనోహర్ శనివారం సాయంత్రం భైంసా వైపు వస్తుండగా భోకర్ చౌరస్తా సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. స్థానికులు వారిని 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. విశాల్, గంగాధర్‌లను నిజామాబాద్‌కు తరలించారు.

క్రీడా పాఠశాలలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు

ఉట్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థులకు గిరిజన క్రీడాశ్రమ పాఠశాలల ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం ఉట్నూర్ డివిజన్ స్థాయి క్రీడాశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఎంపిక కోసం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆయన పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లాలో నాలుగేళ్ల క్రితం క్రీడాశ్రమ పాఠశాలలు ప్రారంభమయ్యాయని, నాటి నుంచి వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్న క్రీడల ద్వారా గిరిజన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. ఈ విద్య సంవత్సరంలో వివిధ సందర్భాల్లో నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల ద్వారా గిరిజన విద్యార్థులు 160 పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగేలా క్రీడ పాఠశాలల్లో తీర్చిదిద్దుతామన్నారు. ఈ నెల 28న బోథ్ డివిజన్ స్థాయి పోటీలు జాతర్లలో, వచ్చే నెల 1వ తేదీన ఆదిలాబాద్ డివిజన్ స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడలాధికారి పార్థ సారథి, ఏటీడీవో క్రాంతి, క్రీడ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, కోచ్‌లు ఉత్తం, హేమంత్, శ్రీనివాస్, రవీందర్, సునంద్, జయవంత్, శేఖర్, జలపతి, స్వప్న, శివ ఉన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువకులు మృతి



రాజు మృతదేహం



దత్తాహరి (ఫైల్)

కుభీర్: మండలంలో వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువకులు శనివారం మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం కుభీర్‌కు చెందిన పోతన్న అనే రైతు చేనులో శుక్రవారం రాత్రి బోరు వేస్తున్న క్రమంలో ఆ బండిపై పనిచేసే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన అక్క రాజు (31) భోజన సమయంలో బోరుబండిపై పడుకున్నాడు. ఆపరేటర్ మరిచి బోరుబండిని ఆపరేట్‌చేయగా రాడ్ తలకు తగిలింది. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యశ్వంత్ తెలిపాడు.

వాగులో పడి..

మండలంలోని గొడ్సర గ్రామానికి చెందిన మానేవార్ దత్తాహరి (30) శనివారం మధ్యాహ్నం వాగులోపడి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం... మృతుడి తల్లి, భార్య, చెల్లితో కలిసి తన చేనులో పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో వాగువైపు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా వాగులో శవమై కనిపించాడు. సీఐ చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన గురుకుల విద్యార్థులకు షార్ట్ ఫిలింలో శిక్షణ



పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఇచ్చోడ: తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు షార్ట్ ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పుణేలో ట్రెనింగ్ చేసిన కుమారి లావణ్య నాలుగు రోజుల నుంచి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈశిక్షణలో యాక్టింగ్, డైరెక్షన్, కెమెరా, ఎడిటింగ్‌తో పాటు సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 వరకు ఈ శిక్షణ కొనసాగనుందని వివరించారు.